క్లుప్తంగా

ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

గిద్దలూరు రూరల్: మున్సిపల్ శాఖలో పని చేస్తున్న ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ నాయకుడు టి.ఆవులయ్య డిమాండ్ చేశారు. ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలని, చనిపోయిన వారి పిల్లలకు ఉద్యోగం, ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్ రూ.6 వేలు, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు.

క్రైస్ట్ చర్చ్ ప్రారంభం



మాట్లాడుతున్న డాక్టర్ ఆర్డర్ పాల్

పెద్దదోర్నాల: మండల పరిధిలోని ఐనముక్కలలో క్రైస్ట్ చర్చ్ నూతన మందిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విశాఖపట్నానికి చెందిన అంతర్జాతీయ వాక్యోపదేశకుడు బిషప్ డాక్టర్ ఆర్డర్ పాల్ రిబ్బన్ కట్ చేసి మందిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఇమ్మానియేల్, డైరెక్టర్ గుర్రం శేఖర్, డీపీ యేసయ్య, సింగా రాజేష్ పాల్గొన్నారు.

క్లాప్‌మిత్రలకు వేతనాలు ఇవ్వాలి

దర్శి: మండలంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు తక్షణమే వేతనాలు మంజూరు చేయాలని సీఐటీయూ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కుసుమకుమారికి వినతి పత్రం అందజేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద మంగళవారం కార్మికులకు 11 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ కుసుమకుమారి మాట్లాడుతూ 15 రోజుల్లో కార్మికులకు జీతాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. సీఐటీయూ నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెవి పిచ్చయ్య, నాయకులు పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

తాళ్లూరు(ముండ్లమూరు): స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన కంభంపాటి అఖిల్‌పై అదే కాలనీకి చెందిన అనపర్తి ఇమ్మానుయేలు, మరి కొందరు ఉద్దేశపూర్వకంగా దాడి చేయగా అఖిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై మోహనరావు తెలిపారు. తాళ్లూరుకు చెందిన అనపర్తి ఏసురత్నం, కంభంపాటి అఖిల్‌లు మరికొంత మంది సోమవారం ముండ్లమూరులో జరిగిన లోకేష్ యువగళం పాదయాత్రకు వెళ్లారు. అక్కడ అనపర్తి ఏసురత్నం అను అతను కంభంపాటి అఖిల్‌పై దాడి చేశాడు. దీంతో ఏసురత్నం కుటుంబ సభ్యులు ఇమ్మానుయేలు, మరికొందరు అఖిల్‌పై దాడి చేయగా కేసు నమోదు చేశారు.

వ్యాధినిరోధక శక్తికి తల్లిపాలు శ్రేష్టం



ర్యాలీకి హాజరైన డీఐఎంహెచ్‌ఓ డాక్టర్ రాహుల్, పక్కన మెడికల్ ఆఫీసర్‌లు



మార్కాపురంలో ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, మహిళలు

తర్లుపాడు: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని డీఐఎంహెచ్‌ఓ డాక్టర్ రాహుల్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన మొదటి గంటలోపు తల్లిపాలు ఇవ్వాలని, రెండేళ్ల వరకు తల్లిపాలే మంచిదని సూచించారు. తద్వారా సరైన పోషణ బిడ్డకు లభిస్తుందని, దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండేందుకు తల్లిపాలు దోహదపడతాయన్నారు. అనంతరం నులిపురుగుల నివారణ గురించి సిబ్బందికి వివరించారు. ఈ నెల 7 వతేదీ నుంచి 12 వరకు మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో సిబ్బందికి పలు సూచనలిచ్చిన అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సింధూజ, సీహెచ్‌ఓ తులసీ ప్రసాద్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కృష్ణవేణి, మండలంలోని హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎమ్‌లు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కాపురం: తల్లిపాలు అమృతంతో సమానమని పట్టణ ఐసీడీఎస్ సీడీపీఓ బి.సుశీలాదేవి, సూపర్‌వైజర్ బుజ్జి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రవికుమారి, రమాదేవి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నాయుడుపల్లెలో తల్లిపాల వారోత్సవాలు

మార్కాపురం రూరల్: మండలంలోని గజ్జలకొండ సెక్టార్ పరిధిలోని నాయుడుపల్లి గ్రామంలో తల్లిపాల వారోత్సవాలను మంగళవారం ఉదయం సూపర్‌వైజర్ పి.లలిత సలోమి ఆధ్వర్యంలో నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లులు పాలు ఇవ్వాలని, రెండేళ్ల వరకు పాలు పట్టించాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీస్ డి.విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త వీఎస్ ఫ్లోరెన్స్, తల్లులు పాల్గొన్నారు.

ముర్రుపాలతో వ్యాధి నిరోధక శక్తి

ముండ్లమూరు: అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టిస్తే వ్యాధి నిరోధక పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత అన్నారు. మండంలోని పెద ఉల్లగల్లు, చిన ఉల్లగల్లు, పెదరావిపాడు గ్రామాల్లో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు తల్లిపాల విశిష్టతను వివరించారు. సిబ్బంది కమల, విజయలక్ష్మి, మరియమ్మ, అజితకుమారి, గర్భవతులు పాల్గొన్నారు.

దర్శి: గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆనందలత అన్నారు. స్థానిక క్రిష్టియన్‌పాలెం అంగన్‌వాడీ కార్యాలయంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యకర్తలు జయకుమారి, సుక్కులు, గర్భిణులు పాల్గొన్నారు.



నాయుడుపల్లిలో..



ఉల్లగల్లులో తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న గర్భిణులు



క్రిష్టియన్‌పాలెంలో తల్లిపాల వారోత్సవాల్లో సూపర్‌వైజర్ ఆనందలత

మంత్రి చొరవతో బోరు ఏర్పాటు



దగ్గరుండి బోరు వేయిస్తున్న నాయకులు

పుల్లలచెరువు: రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ చొరవతో మండలంలోని చాపలమడుగులో మంచినీటి బోరు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ సత్యనారాయణరెడ్డి మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో కొన్ని చోట్ల నీటి సమస్య ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన మంత్రి ప్రత్యేక చొరవ తీసుకుని జెడ్పీ నుంచి నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో గ్రామంలో మంచి నీటి బోరు వేసినట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామ ప్రజలు మంత్రి సురేష్ కృతజ్ఞతలను చెబుతున్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో
సత్యనారాయణ స్వామి వ్రతాలు



పూజలకు హాజరైన భక్తులు

ఒంగోలు మెట్రో: తిరుమలలో ప్రతి పౌర్ణమికి శ్రీవారికి జరిగే గరుడసేవ పర్వదినాన్ని పురస్కరించుకొని టీటీడీ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రతి పౌర్ణమికి జిల్లాలో ఒక చోట శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తోంది. తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో అధిక శ్రావణమాసం పౌర్ణమి సందర్భంగా మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు ఒంగోలులోని శ్రీరాధాకృష్ణ ఆశ్రమంలో సామూహిక శ్రీసత్యనారాయణ వ్రతాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వ్రతంలో పాల్గొన్న దంపతులందరికీ స్వామి పూజ వస్తువులు, స్వామి వారి ప్రతిమల రూపులు ఉచితంగా అందించారు. పూజ క్రతువులో వేద పురోహితులు నారాయణరావు పాల్గొన్న దంపతులతో మండపారాధన, నవగ్రహ, అభిషేకం, స్వామి వారి వ్రత కథలు చెప్పారు. కార్యక్రమంలో అరవై మంది దంపతులు, వంద మంది భక్తులు పాల్గొన్నారు. శ్రీరాధాకృష్ణ ఆశ్రమం స్వామి బ్రహ్మచారి వేణుమాధవ్ వ్రత మహాత్మ్యం గురించి ప్రవచనం చేశారు. ఆశ్రమం నిర్వాహకులు మండువ మహేశ్వరరావు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు. పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు, అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. టీటీడీ ప్రోగ్రాం అసిస్టెంట్ రావినూతల రామకృష్ణ ఈ కార్యక్రమం నిర్వహించారు.

జగదాంబ అమ్మవారికి పూజలు



సామూహిక పూజలకు హాజరైన భక్తులు

- లక్ష గాజులతో ప్రత్యేక అలంకారం

మార్కాపురం టౌన్: పట్టణంలో కొలువైన జగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి దేవస్థానంలో చాంద్రమానేన శోభకృత్ నామ సంవత్సర అధిక శ్రావణ మాసం శుద్ధపౌర్ణమి సందర్భంగా జగదాంబ, జ్ఞాన సరస్వతి అమ్మవార్లకు మంగళవారం మంగళ చండీ పూజను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. జగదాంబ అమ్మవారిని సుమారు లక్ష గాజులతో ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. మహిళా భక్తులు సామూహిక లక్ష కుంకుమార్చనలో పాల్గొన్నారు. అర్చకుడు ఆంజనేయస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, చైర్మన్ వి.కేశవరావు, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.



గాజుల అలంకరణలో జగదాంబ అమ్మవారు

గర్భిణులు ఆరోగ్యంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

ముండ్లమూరు: మహిళలు గర్భం దాల్చిన నుంచి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని మారెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గర్భిణులకు అందాల్సిన వైద్యసేవలను క్రమం తప్పకుండా అందించాలన్నారు. ఎప్పటికప్పుడు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి అప్రమత్తం చేయాలన్నారు. బలవర్ధకమైన ఆహారం తీసుకునే వారికి అవగాహన కల్పించాలన్నారు. సీహెచ్‌ఓ వెంకట్రావు, హెచ్‌ఈ అప్పలరాజు, సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, సిబ్బంది ఎస్‌కెఎంఎం సుభాని, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం

- జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ సురేష్



ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలతో మాట్లాడుతున్న జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి సురేష్

మద్దిపాడు: గ్రామాల్లో క్షయ వ్యాధి నివారణకు ప్రతి ఆశ వర్కర్ కృషిచేయాలని జిల్లా క్షయ వ్యాధి నిర్మూలన అధికారి డాక్టర్ రమేష్ అన్నారు. మంగళవారం ఆశా డే సందర్భంగా మద్దిపాడు పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీబీ ముక్త్ పంచాయత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో పొడిదగ్గు దగ్గుతున్న వారి నుంచి కనీసం 15 శాంపుల్స్ తీసుకోవాలన్నారు. శాంపుల్స్‌ను ల్యాబ్‌కు పంపి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామని, ఒకవేళ క్షయ వ్యాధి ఉన్నట్లయితే వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని అన్నారు. డాక్టర్ ఆనందమోహన్ మాట్లాడుతూ కొత్తగా పెళ్లి చేసుకున్న జంటలను గుర్తించడం, కొత్తగా ఎవరైనా చిన్నారులు జన్మిస్తే ఆ ఇంటిని సందర్శించి వారి గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల పై వివరించారు. అనంతరం ఈ ఆశా యాప్‌పై ఆశ వర్కర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వారి వెంట డాక్టర్ జగదీష్, సీహెచ్‌ఓ లలితమ్మ, వెంకారెడ్డి, సూపర్‌వైజర్లు బాల కోటయ్య, నాగేశ్వరరావు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల సీహెచ్‌ఓలు, ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే అన్నా జన్మదిన వేడుకలు



పూలవర్షంలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అన్నా



గిద్దలూరు: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిపారు. తొలుత తాటిచెర్ల మోటు నుంచి బైక్ ర్యాలీతో ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. రాచర్ల గేటు సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద క్రేన్ సాయంతో గజమాల వేశారు. అనంతరం అక్కడ దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేలాది మంది కార్యకర్తలు, అభిమానుల మధ్య ర్యాలీగా మార్కెట్ యార్డు వద్దకు వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను భార్య దుర్గాకుమారి, కుమారుడు కృష్ణచైతన్య, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి కట్ చేశారు. పెద్ద ఎత్తున భోజనాలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే అన్నా మాట్లాడుతూ 2024లోనూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో తానే ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని స్పష్టం చేశారు. కొందరు రాజకీయంగా తనను దెబ్బతీయాలనే ఉద్దేశంతో అనేక పుకార్లు పుట్టిస్తున్నారని, అటువంటి తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు పలువురు ప్రముఖులు, అధికారులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆకాశంలో సీఎం జగన్, ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఫొటోలతో ఉన్న పెద్ద బెలూన్ చూపరులను అబ్బురపరిచింది. నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, జెడ్పీటీసీ బుడతా మధుసూదన్ రావు, రాచర్ల జెడ్పీటీసీ వెంకటనాయుడు, వైస్ చైర్మన్లు ఆర్‌డీ రామకృష్ణ, కాతా దీపిక, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కోటానరసింహులు, ఆదర్శ విద్యాసంస్థల అధినేత బుడత తిమ్మయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు సీఆర్‌వి మురళి, కావేటి ఈశ్వర్, బత్తెం ఓబులరావు, డాక్టర్ భూమా నరసింహారెడ్డి, నెమలిరెడ్డి, నంద్యా బాలు, ముద్దర్ల శ్రీను,ఆరు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే అన్నా జన్మదిన వేడుకలు

మార్కాపురం: గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు పుట్టినరోజు వేడుకలు మంగళవారం మార్కాపురం మండలంలో ఘనంగా జరిగాయి. సోమవారం అర్ధరాత్రి 12 గంటలు దాటగానే ఆయన నివాసానికి పలువురు పట్టణ ప్రముఖులు హాజరై కేక్ కట్‌చేసి స్వీట్లు పెట్టి సన్మానించారు. ఎమ్మెల్యే కేపీ సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాల మురళీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ గొలమారు శ్రీనివాసరెడ్డి, ఎన్ఎస్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ నాదెండ్ల చంద్రమౌళి, ఎస్‌వీకేపీ డిగ్రీ కాలేజీ పాలక మండలి మాజీ చైర్మన్ యక్కలి కాశీ విశ్వనాథం, మున్సిపల్ మాజీ చైర్మన్ వక్కలగడ్డ రాధిక మల్లికార్జున్, గిద్దలూరు, మార్కాపురం, కంభం సర్కిల్ పోలీసు అధికారులు భీమానాయక్, దేవ ప్రభాకర్, రాజేష్, ఎస్సైలు, గోడౌన్ డీటీ చంద్రశేఖర్, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి బొగ్గరపు శేషయ్య, ఉదయ్ కేబుల్ నెట్‌వర్క్ చైర్మన్ పరమేశ్వరరెడ్డి, ప్యాసింజర్స్ అసోషియేషన్ అధ్యక్షులు ఆర్‌కేజీ నరసింహం, పత్తి వెంగన్న, ఆడిటర్ తోట సత్యనారాయణ, కౌన్సిలర్లు కొత్త కృష్ణ, సిరాజ్, విశ్రాంత ప్రిన్సిపాల్ డేవిడ్ స్టన్, మురళి, దర్మకర్త సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కొమరోలు: గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు అన్నా వెంకట రాంబాబు జన్మదిన వేడుకలు మండల కేంద్రం కొమరోలులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకటనాయుడు ఆధ్వర్యంలో స్థానిక గ్రామ సచివాలయంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు నిర్వహించారు. భారీ కేక్‌ను ఏర్పాటు చేసి జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు కట్ చేసి పంచి పెట్టారు. అనంతరం పెట్రోల్ బంకు నుంచి బైక్ ర్యాలీగా తాటిచెర్లమోటు వరకు వెళ్లి అక్కడి నుంచి ఎమ్మెల్యేను గిద్దలూరు తీసుకెళ్లారు. వైస్ ఎంపీపీ షేక్ మౌలాలి, ఎంపీటీసీలు సుభానీ వైఎస్సార్ సీపీ నాయకులు గజ్జలకొండ వెంకటేశ్వర్లు, ఏలూరి రమణయ్య, తిరుమలనాథ్, రమణయ్య, సుబ్రహ్మణ్యం, మోహన్‌రెడ్డి, వెంగయ్య చౌదరి పాల్గొన్నారు.

బేస్తవారిపేట: స్థానిక పాత వెంకటేశ్వర సినిమాహాల్ సెంటర్‌లో, పందిళ్లపల్లె టోల్ ప్లాజా వద్ద ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు పుట్టిన రోజు వేడుకలు వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాత సినిమాహాల్ సెంటర్ నుంచి భారీ బైక్ ర్యాలీ ఏర్పాటు చేశారు. టోల్‌ప్లాజా వద్ద పందిళ్లపల్లె వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన కేక్‌ను ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు కట్ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు పుష్పగుచ్ఛాలు అందిస్తున్న పోలీసు అధికారులు



కొమరోలు: కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వేపనూనె పిచికారీతో బహుళ ప్రయోజనాలు



రైతులకు సలహాలు ఇస్తున్న ఏఓ ప్రసాదరావు

తాళ్లూరు(ముండ్లమూరు): రైతులు సాగు చేసిన పైరు మొలకెత్తిన 30 రోజుల వ్యవధిలో రెండు సార్లు వేపనూనె పిచికారీ చేస్తే చీడపీడలను నివారించవచ్చని వ్యవసాయాధికారి బి. ప్రసాదరావు అన్నారు. మండలంలోని బొద్దికూరపాడులో రైతులు సాగు చేసిన పొలాన్ని మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు వరి, మొక్కజొన్న, సజ్జ పైర్లు సాగు చేశారని, ఆయా పైర్లపై రెండు పర్యాయాలు వేపనూనె పిచికారీ చేసుకుంటే అనవసరమైన రసాయన మందులు పిచికారీ చేయాల్సిన పని లేదన్నారు. పైరు తొలిదశలో ఎకరాకు లీటరు వేపనూనెను తగిన మోతాదులో నీటిలో కలిపి పిచికారీ చేసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. వీఏఏ అజ్మీర్, రైతులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌తో అప్రమత్తంగా ఉండాలి



క్యాన్సర్ వ్యాధి గురించి వివరిస్తున్న డాక్టర్ రమణారెడ్డి

ముండ్లమూరు: క్యాన్సర్ బారిన పడిన వారు నిత్యం అప్రమత్తంగా ఉండాలని సర్జికల్ అంకాలజిస్ట్ నారు రమణారెడ్డి అన్నారు. మండలంలోని మారెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మంగళవారం జీఎంఎస్ఆర్ ఒంగోలు ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచు రక్తంలో కళ్లె పడడం, ఛాతిలో నొప్పి, బరువు తగ్గడం, శ్వాసకోశ ఇబ్బందులు వస్తుంటే తక్షణమే పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. అనంతరం 52 మందికి పరీక్షలు నిర్వహించారు. వారిలో 20 క్యాన్సర్ అనుమానితులను గుర్తించి ఒంగోలుకు రిఫర్ చేశారు. వైద్యాధికారి మధుశంకర్, సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సీబీఏ పరీక్షల పరిశీలన



పరీక్షను పరిశీలిస్తున్న ఎంఈఓ

దొనకొండ: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక ఉర్దూ పాఠశాలలో మంగళవారం సీబీఏ పరీక్షలను విద్యాశాఖాధికారి సాంబశివరావు సందర్శించారు. ఉపాధ్యాయులకు పలు సూచన, సలహాలు అందించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు ఆదిమూలపు ప్రభుదాసు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో పౌర్ణమి పూజలు

త్రిపురాంతకం: బాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో శ్రావణ పౌర్ణమి అధిక మాసం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. త్రిపురాంతకం అమ్మవారి ఆలయానికి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు ప్రత్యేకంగా కుంకుమార్చనలు చేశారు. ప్రత్యేక పూజలు ఆలయ అర్చకుడు ప్రసాదశర్మ నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆశీర్వచనం, ప్రసాదాలు అందజేశారు.